క్లుప్తంగా

విస్తృతంగా వాహన తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ దశరథ్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఎస్‌ఐ దశరథ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. లైసెన్సులు లేకుండా రోడ్లపైకి వస్తే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలను ఇచ్చినవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానికులు, వాహనదారులు పాల్గొన్నారు.

ఘనంగా నగర సంకీర్తన


శోభాయాత్రలో నృత్యం చేస్తున్న భక్తులు

జహీరాబాద్: పట్టణంలో నగర సంకీర్తన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కంది హరేకృష్ణ ఆలయ ప్రతినిధి విభీషణ్ ప్రభుజీ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీరాం మందిర్ నుంచి హనుమాన్ మందిరం వరకు, అక్కడి నుంచి రాచన్న మందిరం మీదుగా భక్తులు శ్రీకృష్ణ కీర్తనలు పాడుతూ, నృత్యం చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు.

పంటల పరిశీలన


పత్తిపంటను పరిశీలిస్తున్న ప్రవీణ్‌కుమార్

వట్‌పల్లి(అందోల్): మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో పంట నీట మనిగి పత్తి పంట దెబ్బతినడంతో ఈనెల 20న 'వర్షానికి దెబ్బతిన్న పత్తి పంట'ను పరిశీలించని అధికారులు అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన మండల వ్యవసాయాధికారులు వర్షానికి దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించినట్లు ఏఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పత్తిలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. ఎకరాకు 15–20 కిలోల యూరియా చల్లుకోవడం లేదా నానో యూరియాను ఎకరాకు 500 గ్రాములు పిచికారీ చేసుకోవాలని సూచించారు. మొక్కలు వాడిపోతే ఆక్సిసిక్లోరైడ్‌ను పిచికారీ చేసుకోవాలని.. ఏమైనా సందేహాలుంటే క్లస్టర్ పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలని సూచించినట్లు వివరించారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు


బహుమతులు అందుకున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: విద్యార్థుల్లో దాగిన ప్రతిభ వెలికితీసేందుకు చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ వారు పట్టణంలోని ఇస్లామిక్ సెంటర్‌లో ఆదివారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. సుమారు 150 మంది విద్యార్థులు హాజరుకాగా సీనియర్, జూనియర్ విభాగాల్లో ఉపన్యాసం, వ్యాసరచన, డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్ తదితర అంశాలపై పోటీలను నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షురాలు హజరాబేగం, జహీరాబాద్ అధ్యక్షురాలు మిన్హాజ్ నాజియా, కన్వీనర్ సయ్యద్ మెహ్నాజ్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి నుంచి ఆస్పత్రి ఖర్చుల కోసం ఖేడ్ మండలం అనంతసాగర్‌కు చెందిన జుర్రు సంతుకు రూ.24 వేలు, మాధ్వార్ తండాకు చెందిన నందినికి రూ.7,500, సక్కుబాయికి రూ.15 వేలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, మాజీ సర్పంచ్‌లు రాజునాయక్, సిద్దు, సంజీవులు, సురేష్, మల్గొండ, రాంరెడ్డి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.


అమీన్‌పూర్: హ్యాపీ ఫెదర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల బోనాల ఊరేగింపు


జోగిపేట: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మాజీ చైర్మన్ భిక్షపతి

ఊరూరా బోనాల సంబురం

ఆషాఢమాస చివరి ఆదివారం బోనాల సంబరాలు జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆయా ఆలయాల్లో సందడి నెలకొంది. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవార్ల నైవేద్యం సమర్పించారు. పురవీధుల్లో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకలు, దప్పుల చప్పుళ్లతో ఆధ్మాత్మికం, అమ్మవార్ల పాటతో పల్లెలు మార్మోగాయి. మహిళలు మొక్కులు చెల్లించుకొని పాడి, పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.


నారాయణఖేడ్: బోనాలు సమర్పిస్తున్న మహిళలు


జిన్నారం: విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో..


జహీరాబాద్: బోనాలతో తరలిన మహిళలు


మునిపల్లి(అందోల్): తాటిపల్లిలో బోనాలు వస్తున్న మహిళలు


సంగారెడ్డి క్రైమ్: బోనాలతో ఊరేగింపుగా తరలిన మహిళలు

శరవేగంగా ఆస్పత్రి నిర్మాణం

- రూ.2. 45 లక్షల నిధులు మంజూరు
- నాలుగు మండలాలకు అందనున్న వైద్య సేవలు
- 30 పడకల ఆస్పత్రితో తీరనున్న రోగుల కష్టాలు
- 24 గంటలు అందుబాటులో వైద్యం


కంకోల్‌లో ఆస్పత్రి నిర్మాణం

మునిపల్లి(అందోల్): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ మునిపల్లి మండలం కంకోల్‌లో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.2 కోట్ల 45 లక్షల నిధులు మంజూరు చేసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. 65వ నంబర్ జాతీయ రహదారి అతి సమీపంలో 30 పడకల ఆస్పత్రి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. త్వరలో నిర్మాణ పనులు పూర్తి చేసి ఆస్పత్రిలో సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు పేర్కొంటున్నారు. మునిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగుతోంది. దాని పరిధిలో ఆయా గ్రామాల్లో ప్రస్తుతం 8 సబ్ సెంటర్లు పని చేస్తున్నాయి. సబ్ సెంటర్ల పరిధిలో సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. గర్భిణీలు, బాలింతలు, సాధారణ రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి.

30 రకాల వైద్య సేవలు

మునిపల్లి, కోహీర్ , ఝరాసంగం, రాయికోడ్ మండలాలోని మారుమూల గ్రామాల నుంచే కాకుండా ఇతర గ్రామాల సాధారణ రోగులు, అత్యవసర సేవలు కంకోల్ ఆరోగ్య కేంద్రంలో అందించేందుకు 30 పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నారు. 2024 ఫిబ్రవరి 11న ఆరోగ్య శాఖ మంత్రి దామోదర కంకోల్‌లో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

24 గంటలు వైద్య సేవలు

మండలాల్లోని సుమారు 22 గ్రామాల ప్రజలకు 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండనున్నాయి. 65వ నంబర్ జాతీయ రహదారితో పాటు ఇతరాత్ర జరిగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించేందుకు సంబంధిత అధికారులు తగిన సౌకర్యాలను ఈ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం కంకోల్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) పేరుపై ఆయా గ్రామాల రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఉ.9 గంటల నుంచి సా.4 గంటల వరకు చికిత్సలు పొందుతున్నారు.

ఎంతో ఉపయోగం



కంకోల్‌లో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఆయా గ్రామాల ప్రజలకే కాకుండా ఇతర మండలాలు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సత్వరమే చికిత్స అందుతుంది.

–చల్మెద వీరన్న, మగ్దుంపల్లి

మెరుగైన వైద్యం



రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య సిబ్బందిని సంబంధిత అధికారులు ఏర్పాటు చేయడం జరుగుతుంది. నిర్మాణం పనులు పూర్తయితే ఆస్పత్రిని వినియోగంలోకి తీసుకుని వైద్య సేవలు అందిస్తాం.

– డాక్టర్ రవి, కంకోల్

ఇంటింటికెళ్లి పథకాలపై అవగాహన

జహీరాబాద్ టౌన్: యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆదివారం మండలంలోని రంజోల్ గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు ఇచ్చిన తెల్లషర్టు ఉద్యమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని చెబుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారికి పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు అక్బర్, ప్రేమ్, స్వరాజ్, శ్రీకాంత్, రాజేష్‌గౌడ్, నవీన్, ఖాదర్ పాల్గొన్నారు.


పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న నరేష్‌గౌడ్

చెట్ల కొమ్మల్లో విద్యుత్ తీగలు

సంగారెడ్డి క్రైమ్: జిల్లా కేంద్రంలోని కల్వకుంట సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల హాస్టల్ వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ తీగల చుట్టూ చెట్ల కొమ్మలు పెరిగాయి. ప్రతి సంవత్సరం వర్షాకాలం ముందు చెట్ల కొమ్మలను తొలగించే విద్యుత్ సిబ్బంది ఈసారి అలాగే వదిలేశారు. గత రెండు రోజులుగా గాలికి విద్యుత్ తీగల మధ్య రాపిడి ఏర్పడుతుందని వెంటనే కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


విద్యుత్ తీగల చుట్టూ చెట్ల కొమ్మలు



శాకాంబరీగా అమ్మవారు

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కత్తికా నక్షత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంతకిషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహిళలు లలిత సహస్ర, వాసవీమాత చరిత్ర పారాయణం చేసి సామూహిక కుంకుమార్చనలు జరిపించారు. అమ్మవారిని దర్శించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ కోశాధికారి మల్లేశం, కార్యనిర్వాహ క కార్యదర్శి విద్యాసాగర్, మహిళా విభాగం అధ్యక్షురాలు తేజావతి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పేదల సొంతింటి కలను నెరవేర్చడం కోసం అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్ మండలం పీర్లతండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, నిజాంపేట్‌లో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఆదివారం ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయి. వాటి నిర్మాణాలు పూర్తయిన వెంటనే మరో వెయ్యి ఇళ్లు మంజూరు అవుతాయన్నారు. లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక, డబ్బులు లేని పేద మహిళలకు మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష రుణం అందిస్తున్నట్లు చెప్పారు. నిజాంపేట ఎంపీడీఓ సంగ్రాం, మాజీ ఎంపీపీలు జీవులానాయక్, రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, రాంరెడ్డి, రాధాక్రిష్ణ, పరుశురాం, రాజేష్ నాయక్, హౌసింగ్ ఏఈలు సత్యనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.


భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల రోడ్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎంపీపీ రాంరెడ్డి, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మక్తక్యాసారం గ్రామంలో వారు మాట్లాడారు. తాటిపల్లి, పెద్దలోడి మీదుగా మక్తక్యాసారం గ్రామం వరకు డబుల్ రోడ్డు ఏర్పాటుకు నిధుల మంజూరుకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీలను మక్తక్యాసారం గ్రామస్తులకు చూయించారు. డబుల్ రోడ్డు ఏర్పాటయితే సుమారు 12 గ్రామాలకు సౌకర్యంగా ఉంటుందని వారు తెలిపారు. రూ.42 కోట్లతో తాటిపల్లి నుంచి మక్తక్యాసారం, రాయికోడ్ మండలం సింగితం నుంచి కోడూర్ వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు ఈ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీషకుమార్, మక్తక్యాసారం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


ప్రొసీడింగ్ కాపీలను చూపిస్తున్న నాయకులు


ఊడిపడిన సైడ్ గ్రిల్స్‌ను చూపిస్తున్న నర్సింలు


రోడ్డు మధ్యలో పడిన గుంతల వద్ద నాయకులు

ఫ్లైఓవర్ బ్రిడ్జి పరిశీలన

జహీరాబాద్ టౌన్: శిథిలావస్థకు చేరిన రాంనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఆదివారం సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ డివిజన్ కార్యదర్శి కె.నర్సింలు మాట్లాడుతూ.. 25 సంవత్సరాల క్రితం నిర్మించిన బ్రిడ్జి దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. ప్రతి రోజుల పదు సంఖ్యలో వాహనాలు, స్కూల్ బస్సులు, ఆటోలు తిరుగుతున్నందున ప్రమాదం పొంచి ఉందన్నారు. అధికారులు తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదని ఆరోపించారు. రోడ్డుపై పడ్డ గుంతలను కూడా పూడ్చడం లేదన్నారు. సైడ్ గ్రిల్స్ ఊడికింద పడుతున్నాయని, స్ట్రీట్ లైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదన్నారు. రాత్రి పూట అంధకారం నెలకొని ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. బ్రిడ్జిపై నుంచి ప్రయాణించాలంటే ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

కంపుకొడుతున్న బస్టాండ్

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ మురికినీరు, చెత్తకుప్పలతో కంపు కొడుతోంది. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఆర్టీసీ ఆవరణలోనే ఇలా ఉంటే జిల్లాలోని మిగతా బస్టాండ్లలో ఎలా ఉంటాయోనని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. ప్రతిరోజు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, బస్టాప్‌లో ఏర్పాటు చేసిన పార్క్‌లో చెత్తతో నిండి ఉంటుందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ సిబ్బంది, జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని, బస్టాండ్‌లో దుర్వాసన రావడంతో ఎక్కువసేపు నిలబడలేక పోతున్నామని ప్రయాణికులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.


చెత్తకుప్పలతో నిండిన సంగారెడ్డి బస్టాండ్


నీరు నిల్వడంతో కంపుకొడుతున్న బస్టాండ్

మలుపు ప్రమాదానికి నిలయం

సంగారెడ్డి క్రైమ్: మండలంలో పలుచోట్ల రహదారి మలుపులు వాహనదారులకు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మండల కేంద్రం కల్వకుంట నుంచి చిమ్మాపూర్, కంది వరకు మలుపులతో కూడిన బీటీ రోడ్లు ఉన్నాయి. అలాగే ప్రమాదకరమైన మలుపులున్నాయి. కనీసం సూచిక బోర్డు సైతం లేవు. దారి పొడవునా కంపచెట్లు అల్లుకుపోయాయి. కొన్నిచోట్ల మలుపు తిరిగిన స్థలాల్లో మరింత ప్రమాదకరంగా మారాయి. తక్షణమే అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రమాదకర మలుపు

డబుల్ ఇళ్ల లెక్క తేలింది!

స్క్రీనింగ్‌లో అనర్హుల ఏరివేత

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని హోతి(కె) వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల లెక్క అధికారులు తేల్చినట్లు తెలిసింది. జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నట్లు ఆరోపణలు రావడంతో రెవెన్యూ అధికారులు ఇళ్ల పంపిణీ నిలిపివేసిన విషయం తెలిసిందే. మూడు రోజుల పాటు విచారణ చేపట్టి స్క్రీనింగ్ చేశారు. జాబితాలో ఎంత మంది అర్హులు ఉన్నారో గుర్తించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హోతి(కె) వద్ద పేదల కోసం 660 ఇళ్లను కట్టించగా అధికారులు డ్రా ద్వారా లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇళ్లను అప్పగించలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. జాబితాలో అనర్హులకు చోటు కల్పించారన్న ఆరోపణలు రావడంతో అధికారులు పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. విచారణ చేపట్టి అర్హులకు ఇస్తామని చెప్పి తహసీల్దార్, ఆర్డీఓ, మున్సిపల్, ఎంపీపీ నాలుగు ప్రభుత్వ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డులపై జాబితాను అంటించారు. అభ్యంతరాలుంటే మూడు రోజుల లోపు ఫిర్యాదు చేయాలని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద మూడు రోజుల పాటు రెండు విచారణ కౌంటర్లను ఏర్పాటు చేసి ఫిర్యాదు స్వీకరించారు. 660 మంది లబ్ధిదారుల జాబితాలో స్క్రీనింగ్ చేయగా 134 మంది అనర్హులు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. మిగతా వారంతా అర్హులని, వీరికి ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు సమాచారం.


హోతి(కె) వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు